# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 255 | పేజీలు: 4 | వెల: రూ.4/- | మంగళవారం 12 మే 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## విద్యా విధానాన్ని అధ్యయనం చేయడానికి
# ఫిన్‌లాండ్ పంపించాం: రేవంత్ రెడ్డి

**అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి ఉత్తమ విద్యావిధానాలను అమలు చేస్తామని హామీ**

**విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకు రాగలమన్న రేవంత్ రెడ్డి**

**అందుకే విద్యాశాఖను తాను నిర్వహిస్తున్నట్లు వెల్లడి**



**హైదరాబాద్, మే 11 (నమస్తే ఉదయం)**

విదేశాల్లో అమల్లో ఉన్న విద్యావిధానాలను అధ్యయనం చేయడానికి 25 మంది టీచర్లను ఫిన్‌లాండ్‌కు పంపించామని, అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి ఉత్తమ విద్యావిధానాలను తెలంగాణలో అమలు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన విద్యావారోత్సవాల కార్యక్రమంలో మాట్లాడుతూ, విద్యావ్యవస్థకు సంబంధించి రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని, అందుకే విద్యాశాఖను తానే నిర్వహిస్తున్నానని అన్నారు. విద్యా వ్యవస్థలో తెలంగాణ దశాబ్దాలుగా వివక్షకు గురైందని అన్నారు. అందుకే 1969లో తెలంగాణ ఉద్యమం వచ్చిందని, నాటి నుంచి నాలుగున్నర దశాబ్దాలు పోరాడి తెలంగాణను సాధించుకున్నామని తెలిపారు. అందరికీ నాణ్యమైన విద్య అందించాలని అన్నారు. తమ ప్రభుత్వం రాగానే 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని, 60 రోజుల్లో పరీక్షలు నిర్వహించి నియమక పత్రాలు అందించినట్లు చెప్పారు. వివాదాలు లేకుండా 36 వేల మంది టీచర్లను బదిలీ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలు ఫలితాల్లో ఎందుకు వెనుకబడి ఉన్నాయో ఆలోచించాలని అన్నారు. విద్యాశాఖకు 15 శాతం నిధులు పెంచుతామని హామీ ఇచ్చారు. తెలంగాణలో ఉత్తమ విద్యావిధానాలను అమలు చేస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకహారం పెట్టనున్నట్లు చెప్పారు. మధ్యాహ్న భోజనంతో పాటు బ్రేక్ ఫాస్ట్ పథకం అమలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టామని అన్నారు. విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయని, కానీ మనం మాత్రం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే కొనసాగిస్తున్నామని అన్నారు. టెన్ ప్లస్ టు విధానం లేకపోవడం వల్ల డ్రాపవుట్లు పెరుగుతున్నాయని వెల్లడించారు. కుల వివక్షను నిర్మూలించేందుకు తాము ఇంటిగ్రేటెడ్ స్కూళ్ళ నిర్మాణం చేపట్టామని ముఖ్యమంత్రి తెలిపారు.



**ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు భారత్**
# తలొగ్గదని నిరూపించాం
## ప్రధాని మోదీ

**చంద్రయాన్ ప్రాజెక్టులో రోవర్ దిగేచోటును శివశక్తి పాయింట్ అని పేరు పెట్టాం**

**సోమ్‌నాథ్ మహాదేవ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకల్లో మోదీ**

**స్మారక నాణెం విడుదల**

**న్యూఢిల్లీ, మే 11 (నమస్తే ఉదయం)**

ప్రపంచంలోని ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు భారత్ తలొగ్గదని నిరూపించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అటల్ నేతృత్వంలో భారత్ సత్తా అంటే ప్రపంచానికి ఏమిటో చూపించామని గుర్తు చేశారు. గుజరాత్‌లోని పవిత్ర పుణ్యక్షేత్రమైన సోమ్‌నాథ్ మహాదేవ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. వేదికపై నుంచి 75 ఏళ్ల పునర్నిర్మాణానికి గుర్తుగా ప్రత్యేక పోస్టల్ స్టాంపుతో పాటు 75 రూపాయల స్మారక నాణేన్ని ప్రధాని విడుదల చేశారు.

## త్వరలో 17 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల్లో 'ఎస్ఐఆర్'



**ఐదు రాష్ట్రాల ఎన్నికలు సహా వివిధ కారణాలతో తాత్కాలిక బ్రేక్**

**99 కోట్ల మంది ఓటర్లలో 60 కోట్ల ఓటర్ల 'ఎస్ఐఆర్' ప్రక్రియ పూర్తి**

**మిగిలిన 40 కోట్ల ఓటర్ల 'ఎస్ఐఆర్' ప్రక్రియ త్వరలో చేపట్టనున్నట్లు వెల్లడి**

**హైదరాబాద్, మే 11 (నమస్తే ఉదయం)**

రాబోయే కొద్దిరోజుల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) మూడవ దశను ప్రారంభిస్తామని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. 40 కోట్ల మంది ఓటర్లను కవర్ చేస్తూ, మిగిలిన 17 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల్లో 'ఎస్ఐఆర్' ఉంటుందని వెల్లడించారు. ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరిగాయి. ఈ నేపథ్యంలో 'ఎస్ఐఆర్' ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఫలితాలు వెలువడిన నేపథ్యంలో మూడో దశకు సమాయత్తమవుతుంది. ఇప్పటి వరకు ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కేరళ, పుదుచ్చేరి, అండమాన్ నికోబర్ దీవులు, లక్షద్వీప్, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవా, బీహార్ రాష్ట్రాలలో 'ఎస్ఐఆర్' చేపట్టారు. అసోంలోనూ ప్రత్యేక సవరణ కార్యక్రమం జరిగింది. మొత్తం దేశంలోని 99 కోట్ల మంది ఓటర్లలో 60 కోట్ల ఓటర్లకు సంబంధించిన 'ఎస్ఐఆర్' ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. వాస్తవానికి, ఏప్రిల్ నుంచి సర్ ప్రక్రియ చేపట్టనున్నట్లు పై రాష్ట్రాలకు ఫిబ్రవరి 19వ తేదీన ఈసీ లేఖ రాసింది. ఐదు రాష్ట్రాల ఎన్నికలు సహా వివిధ కారణాల వల్ల బ్రేక్ పడింది. వాటితో పాటు ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాలు సుప్రీంకోర్టుకు వెళ్ళడం కూడా జాప్యానికి కారణమైంది.

**జూన్ 1 నుంచి మహిళలకు**
# ఉచిత బస్సు ప్రయాణం
## పశ్చిమ బెంగాల్ సీఎం

**ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్న సువేందు అధికారి**

**న్యూఢిల్లీ, మే 11 (నమస్తే ఉదయం)**



ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వరుసగా అమలు చేస్తామని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి అన్నారు. జూన్ 1వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంతో ప్రజారవాణాపై ఆధారపడే లక్షలాది మంది మహిళలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఇందులో ఉద్యోగినులు, విద్యార్థులు కూడా ఉంటారని తెలిపారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని కూడా వచ్చే నెల నుంచి అమలు చేస్తామని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న సామాజిక సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్ళు పొడిగించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.

## ఎంకే స్టాలిన్‌తో
# తమిళనాడు సీఎం విజయ్ భేటీ

**ఇతర పార్టీల నేతలతో కూడా!**

**వైకో, అన్బుమణి, సీమన్‌లను మర్యాదపూర్వకంగా కలిసిన విజయ్**

**మంగళవారం వీసీకే నేత తరుమావళవన్‌ను కూడా కలవనున్నట్లు సమాచారం!**

**న్యూఢిల్లీ, మే 11 (నమస్తే ఉదయం)**



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌ను ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత ఆయన వివిధ పార్టీల నేతలతోనూ మర్యాదపూర్వంగా కలిసి, వారితో మాట్లాడారు. తమిళనాడు 17వ అసెంబ్లీ తొలి సమావేశాలు ఈ రోజు అంటే మే 11న ప్రారంభమయ్యాయి. నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులు ఈ రోజు ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీ మొదటి రోజు సమావేశాలు ముగిసిన తర్వాత, సీఎం విజయ్, మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ఇంటికి వెళ్లారు. ఆయనకు డీఎంకే శాసనసభ కమిటీ అధ్యక్షుడు ఉదయనిధి స్టాలిన్ స్వాగతం పలికారు. స్టాలిన్ పుష్పగుచ్ఛం ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం విజయ్, స్టాలిన్‌కు శాలువా కప్పి సత్కరించారు. వారితో కొద్దిసేపు మాట్లాడిన తర్వాత సీఎం విజయ్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ భేటీపై స్టాలిన్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన గౌరవనీయులు విజయ్, నన్ను కలిసి, నాకు గ్రీట్ చేశారు. నేను కూడా వారికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేశాను. సలహాలు ఇచ్చాను" అని పేర్కొన్నారు.



# బంగ్లా సరిహద్దులో కంచె నిర్మాణం

**అవసరమైన భూమి బీఎస్ఎఫ్‌కు బదిలీ: సువేందు అధికారి**

**న్యూఢిల్లీ, మే 11 (నమస్తే ఉదయం)**

భారత్- బంగ్లాదేశ్ సరిహద్దుల మధ్య కంచె నిర్మాణం కోసం అవసరమైన భూమిని బీఎస్ఎఫ్‌కు బదిలీ చేస్తూ బంగాల్ నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 45 రోజుల్లో భూమిని కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు అప్పగించే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు బంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి అధ్యక్షతన సోమవారం జరిగిన తొలి మంత్రివర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం 'ఆయుష్మాన్ భారత్'ను బంగాల్‌లో తక్షణమే అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సువేందు అధికారి తెలిపారు. కేంద్రంతో సమన్వయం చేసుకొని, త్వరలోనే బంగాల్ ప్రజలందరికీ ఉచిత వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖతో కుదుర్చుకోవాల్సిన అవసరమైన ఒప్పందాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి కృషిక్ బీమా యోజన,ౖావీ ౹ాౚ=×, విశ్వకర్మ పథకం, 'బేటీ బచావో బేటీ పఢావో', 'ఉజ్వల యోజన' వంటి కీలక కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలో చురుగ్గా అమలు చేసే ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు.

## ఇంధనం వినియోగం
# తగ్గించాలని మోదీ పిలుపు

**ఇంధన నిల్వలపై కేంద్రం కీలక ప్రకటన**

**న్యూఢిల్లీ, మే 11 (నమస్తే ఉదయం)**



అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరల్లో తీవ్ర అస్థిరత ఉన్నప్పటికీ, మన దేశంలో మాత్రం ఇంధన సరఫరా సజావుగా సాగుతోందని పెట్రోలియం మరియు సహజవాయువు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు. దేశ ప్రజలు పొదుపు మంత్రాన్ని పాటించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. మరోవైపు, పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన కీలక భేటీ నిర్వహించారు. అనంతరం సుజాత శర్మ మాట్లాడుతూ, చమురు రంగ కంపెనీలకు ప్యాకేజీ ఇచ్చే ఉద్దేశం లేదని అన్నారు. భారత మార్కెట్లో సాధారణ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తీసుకున్న సమర్థవంతమైన చర్యల వల్ల దేశంలో ముడి చమురు నిల్వలు సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. దేశంలో ప్రస్తుతం ఆయిల్ రిఫైనరీలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని అన్నారు.

# గణన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి





**నిర్దేశిత వివరాలన్నీ నమోదు చేయాలి.**

**గణనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి.**

**అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల జిల్లా ప్రతినిధి,మే11(నమస్తే ఉదయం)**

జనాభా గణన-2027లో భాగంగా ఈ ఏడాది మొదట ఇండ్ల గణన నిర్వహిస్తున్నందున, ఎన్యుమరేటర్లు నిర్దేశిత వివరాలన్నీ నమోదు చేసుకుని గణనను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు.గద్వాల మున్సిపాలిటీ పరిధిలోనీ లింగంబావి కాలనీ పరిసరాల్లో సోమవారం సంబంధిత బ్లాక్ ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్ గణనను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ లో భాగంగా ప్రతి ఇంటిని తప్పనిసరిగా కవర్ చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఎన్యుమరేటర్ తమకు కేటాయించిన బౌండరీపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, మూడు రోజుల్లో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్లు, సందులు, ఇంటి నంబర్లు, లైన్ నంబర్లను స్పష్టంగా గుర్తిస్తూ పెన్సిల్‌తో మ్యాప్ రూపొందించుకోవాలని సూచించారు. ఇంటి నంబర్లు, లైన్ నంబర్లను మార్కర్ ఆధారంగా నమోదు చేస్తే భవిష్యత్తులో పరిశీలన, రీవెరిఫికేషన్ సులభమవుతుందని తెలిపారు. తమ బ్లాక్ పరిధిలో రోజుకు కనీసం 20 ఇళ్లను కవర్ చేస్తే నిర్ణీత గడువులోగా ఇండ్ల గణన ప్రక్రియ పూర్తవుతుందని పేర్కొన్నారు. గణన సిబ్బంది ఇంటింటికి వెళ్లే సమయంలో తప్పనిసరిగా అధికారిక ఐడి కార్డు వేసుకోవాలని, ప్రజల్లో అనుమానాలు లేకుండా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శానిటేషన్ వాహనాలు, వాట్సాప్ గ్రూపులు, మహిళా సంఘాలు, ఆర్పీలు , స్థానిక చానల్స్ ద్వారా గణనపై ప్రజలకు అవగాహన కలిగేలా పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేస్తున్న గణనను కూడా సంబంధిత చార్జ్ అధికారులు క్షేత్రస్థాయిలో తరచు పరిశీలించాలన్నారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసిన కుటుంబాల వివరాలను కూడా సరి చూసుకొని సంబంధిత యాప్ లో ఖచ్చితమైన గణాంకాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. జనగణన విజయవంతం కావాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ పర్యటనలో గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, తహసిల్దార్ హరికృష్ణ, అదనపు చార్జ్ అధికారి రాజేశ్వర్ రెడ్డి, సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్ లు, తదితరులున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచవద్దు

**మండల స్థాయి ప్రజావాణిలోనే దరఖాస్తులు పరిష్కరించాలి.**

**ప్రజావాణికి 69 దరఖాస్తులు.**

**సెన్సస్ ను విజయవంతం చేసేందుకు కృషి చేయాలి.**

**ధాన్యం కొనుగోలు కేంద్రాలపై పర్యవేక్షణ చేయాలి.**

**పీఎండీడీకేపై అమలుకు నిబద్ధతతో పనిచేయాలి.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 11 (నమస్తే ఉదయం)**



ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచరాదని, మండల స్థాయిలోనే సంబంధిత అధికారులు ఆయా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధు మోహన్, నర్సింగరావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ఎండార్స్మెంట్, తదితర అంశాలపై ప్రజలు ఎక్కువగా ఫిర్యాదులు చేస్తున్నారని, సంబంధిత రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తే ప్రజలు కలెక్టరేట్ వద్దకు రావాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ వారం ప్రజావాణి కి మొత్తం 69 దరఖాస్తులు రావడం జరిగిందన్నారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ సెన్సస్ ను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని, సంబంధిత చార్జి అధికారులు బ్లాక్ లవారీగా పర్యవేక్షణ చేయాలన్నారు. పీఎండీడీకేపై అమలుకు నిబద్ధతతో పనిచేయాలనీ, ఈనెల 12న సంబంధిత ఉన్నతాధికారులు పథకం అమలుపై చర్చించడానికి, క్షేత్రస్థాయిలో పర్యటించడానికి గద్వాలకు వస్తున్నందున లైన్ డిపార్ట్మెంట్ అధికారులు అవసరమైన సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సజావుగా నిర్వహించాలని, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

# వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి





**ప్రభుత్వ విద్యాసంస్థల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు.**

**ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యా వారోత్సవాల ప్రారంభం... అదనపు తరగతి గదులను ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 11(నమస్తే ఉదయం)**



విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోందని, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా సోమవారం నుంచి విద్యా వారోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో పాటు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ముఖ్య అతిథులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే క్యారమ్స్, చెస్, నృత్యం, హ్యాండ్ రైటింగ్, చిత్రలేఖనం, తదితర అంశాల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడమే ధ్యేయంగా విద్యా వారోత్సవాల్లో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2026-2027 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం ఇవ్వడమే కాక జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యాసంస్థల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించడమే ధ్యేయంగా ముందుకెళుతున్నట్లు చెప్పారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా ఆయా పాఠశాలల్లో, కళాశాలలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడమే కాక పూర్తయిన నిర్మాణాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యతనిస్తూ ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలతో పాటు తెలంగాణ మోడల్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్పర్సన్ తుమ్మల జయలక్ష్మి, వైస్ చైర్మన్ శంకర్, గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, పిఎసిఎస్ చైర్మన్ సుభాన్, స్థానిక కౌన్సిలర్ బంగి ప్రియాంక, డీఈవో విజయలక్ష్మి, ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, పాఠశాల జిహెచ్ఎం రేణుకా దేవి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి మోడీ తెలంగాణ పర్యటన ఎందుకోసం?

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీజేపీ లో చేరు అని చెప్పడానికా.**

**ప్రధాని మోడీ ప్రసంగం అంతా అబద్ధాల మయం:**

**తెలంగాణ అభివృద్ధిపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్ర విమర్శలు**

**హైదరాబాద్, మే 11 (నమస్తే ఉదయం) :**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆప్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు హేమ సుదర్శన్ జిల్లోజు, తదితరులు

ఆదివారం సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలు, బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు అన్నారు. గత దశాబ్ద కాలంగా దేశాన్ని, ముఖ్యంగా తెలంగాణను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని, ఇప్పుడు ఎన్నికల వేళ మళ్ళీ అబద్ధపు హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ఆమె మండిపడింది. సోమవారం నగరంలోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయం లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, విభజన చట్టంలో పేర్కొన్న బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి కీలక హామీలను మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని, వీటిపై సమాధానం చెప్పకుండా ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటని అన్నారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్, పెట్రోల్ ధరలు ఆకాశాన్ని తాకుతుంటే, ఆ విషయంపై ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం ఆయనకు సామాన్యుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. ఢిల్లీ మరియు పంజాబ్‌లలో ఆమ్ ఆద్మీ పార్టీ అమలు చేస్తున్న ఉచిత విద్య, వైద్యం, విద్యుత్ వంటి సంక్షేమ పథకాల ముందు బీజేపీ పాలిత రాష్ట్రాల అభివృద్ధి శూన్యమని ఆప్ నేతలు సవాల్ విసిరారు. తెలంగాణ ప్రజలకు కావాల్సింది విభజన రాజకీయాలు కాదని, మెరుగైన జీవన ప్రమాణాలని స్పష్టం చేశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని, తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ప్రధాని ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు.

"తెలంగాణ గడ్డపై అడుగుపెట్టే హక్కు ప్రధానికి ఉన్నా, ఇక్కడి ప్రజలను మోసం చేసే హక్కు లేదు అన్నారు . బీజేపీ పతనం దక్షిణాది నుంచే మొదలవుతుందన్నారు . తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు, వారు మోడీ మాటలను నమ్మే స్థితిలో లేరు," అని అన్నారు.

పంజాబ్ సంజీవ్ అరోరా ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కోసం 6000 కోట్లు విదేశాల నుంచి ఇన్వెస్ట్మెంట్ తీసుకొచ్చాడు అనే కేసులో అరెస్ట్ చేశారు. డెవలప్మెంట్ కోసం 6000 కోట్లు తీసుకురావడం తప్పా, తప్పుడు కేసు పెట్టి జైలులో వేయడం మోడీకి చాతనవుతుంది. కానీ బేటి బచావో అని చెప్పి 17 సంవత్సరాల అమ్మాయిని రేప్ చేస్తే బండి సంజయ్ కుమారుడైన సాయి భగీరథను ఇప్పటిదాకా అరెస్టు చేయలేకపోయారని దుయ్య బట్టారు. బండి సంజయ్ ని సస్పెండ్ చేయలేకపోయారు. ఇది చేతకానితనం కాదా. లేక బీజేపీ లో ఉన్న నాయకులు మర్డర్లు , మానభంగాలు చేసిన తప్పులేదు... అది కరెక్టే అని సమర్థిస్తున్నావా మోడీ అని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమ సుదర్శన్ జిల్లోజు మండిపడ్డారు.. విలేకరుల సమావేశంలో అప్ రాష్ట్ర ఉప కోశాధికారి జావిద్ . సీనియర్ లీడర్ కొడంగల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## పాపిరెడ్డి నగర్‌లోని అక్రమ వాటర్ ప్లాంట్లను తొలగించాలి

**ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి**

**కూకట్ పల్లి, మే 11 (నమస్తే ఉదయం)**

పాపిరెడ్డి నగర్ లోని అక్రమ వాటర్ ప్లాంట్లను తొలగించాలని మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో సబ్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద కి పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఊట్ల చంద్ర రెడ్డి వినతి పత్రం అందించారు. అనంతరం చంద్రారెడ్డి మాట్లాడుతూ... ఈ అక్రమ ప్లాంట్ల వలన భూగర్భజలు అడుగంటుతున్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని అన్నారు. భూగర్భజలాలు అడుగంటడం వలన బోర్లు వెయ్యి ఫీట్లనుండి పదిహేను వందల ఫిట్లు వెయ్యాల్సి వస్తుందని, ఇలా వెయ్యడం వలన ముందు తరాలకు నీళ్ల కరువుఏర్పాడుతుందని తెలిపారు. వాటర్ ప్లాంట్లలో మూడు వంతుల నీరు వృధా అవుతుందని వెంటనే పాపిరెడ్డి నగర్లో ఉన్న వాటర్ ప్లాంటలని తొలగించాలని ప్రధాన కార్యదర్శి ఆర్ భగవంత రెడ్డి, క్యాషియర్ నరసింహులు ముదిరాజ్, అడ్వైజర్ అనంతరాములు, సిహెచ్ సత్యనారాయణ రెడ్డి, ఏ. ప్రభాకర్, పి. శంకర్ రెడ్డి, ఎన్ బాల్ రెడ్డి, టి రాజిరెడ్డి, కె యాదగిరి, జె శంకర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, మహేష్, బస్తీ వాసులు వినతి పత్రం అందించారు.



## మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

**ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కమలాక్షి రాజన్**

**కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది**

**టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్**

**కూకట్ పల్లి, మే 11 (నమస్తే ఉదయం)**

మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, పార్టీలో ప్రతి ఒక్కకార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, అందరికీ తగిన రీతిలో పదవులు ఇవ్వడం జరుగుతుందని ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కమలాక్షి రాజన్ పేర్కొన్నారు. పార్టీ మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం కూకట్ పల్లి ఎన్ కే ఎన్ ఆర్ గార్డెన్స్ లో జిల్లా మహిళా నాయకుల, కార్యకర్తల సమావేశం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మహిళా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంతో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు పెట్రోల్ బంకులు ఆర్టీసీ బస్సులను రేషన్ కార్డులు పెన్షన్లు అందజేయడం జరుగుతుందన్నారు. 33% మహిళ ల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ తనయుడు సాయి భగీరథ పై కేసు నమోదు అయినందున నైతికంగా ఆయన తన మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని రమేష్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రవెల్లి స్వర్ణలత, మల్కాజ్గిరి పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జ్ సునీత మహేందర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ పుష్పారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## శివరాంపల్లి బ్లూ డాల్ఫిన్ స్విమ్మింగ్ క్లబ్‌లో...ఉత్సాహభరితంగా 3వ ఫిన్ స్విమ్మింగ్ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పోటీలు

**రాజేంద్రనగర్ , మే 11 (నమస్తే ఉదయం)**




బ్లూ డాల్ఫిన్ స్విమ్మింగ్ క్లబ్‌లో 3వ ఫిన్ స్విమ్మింగ్ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ , ఆక్వా బిగినర్ టాలెంట్ హంట్ ఫెస్టివల్ ఉత్సాహభరితంగా కొనసాగింది. శివరాంపల్లి బ్లూ డాల్ఫిన్ స్విమ్మింగ్ క్లబ్‌లో ఫిన్‌స్విమ్మింగ్ రాష్ట్ర ఛాంపియన్‌షిప్-కమ్-జాతీయ ఎంపిక ట్రయల్స్‌తో పాటు ట్విన్ సిటీ ఆక్వా ఫెస్టివల్ బిగినర్ టాలెంట్ హంట్‌ను నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ జిల్లాల నుండి 150 మందికి పైగా ఈతగాళ్లు పాల్గొని, ఛాంపియన్‌షిప్‌లో పోటాపోటి పడ్డారు. ఈ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఈతగాళ్లకు జరుగబోయే జాతీయ స్థాయి ఫిన్‌స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కాగా, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జి. రాధిక ఐపిఎస్ మాట్లాడుతూ జల క్రీడలను ప్రోత్సహించడం వల్ల యువత లోని ప్రతిభను పెంపొందించడానికి దోహదం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా బ్లూ డాల్ఫిన్ స్విమ్ క్లబ్ వ్యవస్థాపకుడు , తెలంగాణ ఫిన్‌స్విమ్మింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ దినేష్ రాజోరియా మాట్లాడుతూ ఫిన్ స్విమ్మింగ్‌ను ప్రోత్సహించడం, జాతీయ స్థాయి పోటీల కోసం ప్రతిభావంతులైన ఈతగాళ్లను గుర్తించడం ప్రధాన లక్ష్యంగా ఛాంపియన్‌షిప్‌ను నిర్వహించినట్లు తెలిపారు. జల క్రీడలను ప్రోత్సహించడానికి కోచ్‌లు , యువత తల్లిదండ్రుల అంకితభావాన్ని ఆయన అభినందించారు. ఇలాంటి పోటీలు తెలంగాణ నుండి భవిష్యత్ ఛాంపియన్‌లను తయారు చేయడానికి సహాయపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ పోటీల్లో బోడుప్పల్లోని సిద్దార్థ పబ్లిక్ స్కూల్కు చెందిన విద్యార్థి పిఎం రుత్విక్ బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో సర్దార్ భాషా పట్టన్, శివాషు రాయ్, క్లబ్ అధ్యక్షురాలు జ్యోతి, కోచ్ జగన్ రావు తదితరులు పాల్గొన్నారు.




తెలంగాణ స్టేట్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిష్ 2026 లో ప్రతిభ కనబరుస్తున్న చిన్నారులను అభినం దిస్తున్న మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేశ్. కిక్ బాక్సింగ్ కోచ్లుగా ఉ ంటు కార్యక్రమాన్ని నిర్వహించిన ఎం మహిపాల్, నర్సింగ్ రావు లను సైతం వెంకటేశ్ అభినందించారు. పలువురు క్రీడాకారులు కిక్ బాక్సింగ్ లో జాతీయ స్థాయి లో పాల్గొనడానికి ఎంపిక కావడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేశ్ ను సన్మానించారు. - బుద్వేల్, నమస్తే ఉదయం

## బండి భగీరథ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

**బుద్వేల్, మే 11 (నమస్తే ఉదయం)**



ఎస్ వెంకటేష్

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసులో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేశ్ డిమాండ్ చేశారు. మైనర్ బాలికకు మధ్యం త్రాగించి అత్యాచారం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ కేసు అత్యంత తీవ్రమైనదన్నారు. ఇలాంటి సంఘటనలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండ చట్టం తన పని తాను చేసుకుపోవాలన్నారు. బాధితురాలుకు పూర్తి స్థాయి లో న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఫోక్సో వంటి తీవ్రమైన కేసుల్లో ఆలస్యం చేయడం సమాజానికి తప్పుడు సంకేతాలు పంపినట్లేనన్నారు.



గృహ గణన చేయడానికి నియమితులైన ఎన్యూమరేటర్లు

## అత్తాపూర్ సర్కిల్‌లో ప్రారంభమైన గృహ గణన కార్యక్రమం

**బుద్వేల్, మే 11 (నమస్తే ఉదయం)**

అత్తాపూర్ సర్కిల్ లో ఉన్న 4.4 లక్షల జనాభ, ఒక లక్ష ఒక వెయ్యి కుటుంబాల కు చెందిన గృహాల గణన చేయడానికి 582 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. వారిపై 80 మంది సూపర్వైజర్లు పనిచేస్తున్నారు. సోమవారం నుంచి గృహాల గణన ప్రారంభమైంది. మె దటి విడత లో బాగంగా జూన్ 9వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ముందుగా చేపడుతున్న గృహాల గణన లో ఇంటి యజమాని వివరాల తో పాటు 32 ప్రశ్నలను అడిగి ఆన్లైన్ లో పొం దుపరుస్తారు. ఈ కార్యక్రమం పూర్తయిన తర్వాత 2027 ఫిబ్రవరి నుంచి జనగణన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బంది రావద్దు

**తాసిల్దార్ ఝాన్సీరాణి**

**గద్వాల జిల్లా ప్రతినిధి(మల్దకల్)మే 11,(నమస్తే ఉదయం)**



కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తాసిల్దార్ ఝాన్సీరాణి నిర్వాహకులకు ఆదేశించారు. సోమవారం మల్దకల్ మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని, బిజ్వారంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాసిల్దార్ తనిఖీ చేశారు. రైతులకు త్రాగునీరు అన్ని సదుపాయాలు కల్పించి వచ్చిన సరుకులను రవాణా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యాన్ని భద్రపరచుకొని కేంద్రాలకు తరలించాలని రైతులకు సూచించారు. ఆమె వెంటా జిపిఓ తదితరులు ఉన్నారు.

## ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం

**బుద్వేల్, మే 11 (నమస్తే ఉదయం)**



కె జయన్న

ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదు. రాజేంద్రనగర్ ఎస్ రాజ్ కుమార్ తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి.. ప్రేమావతిపేట్ కు చెందిన కె జయన్న (45) కూలీ పని చేస్తు జీవిస్తాడు. ఈ నెల 5వ తేదీన ఇంట్లో నుంచి పనికోసం అని బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. ఆయన కోసం బంధువులు, తెలిసిన వారి ఇండ్లలలో వెతికినా ఫలితం కనిపించలేదు. దీంతో ఆయన భార్య మణెమ్మ రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ రాజ్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. జయన్న వివరాలు తెలిసిన వారు రాజేం ద్రనగర్ పోలీస్ స్టేషన్ లో గాని, లేదా 9849189197 నెంబరు లో గాని సమాచారం ఇవ్వాలన్నారు.

## కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య

**బుద్వేల్, మే 11 (నమస్తే ఉదయం):**



చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న నాబా కుమార్ మహాపాత్ర

బ్రతకు దెరువు కోసం ఒడిస్సా నుంచి రెండు సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి కాటేదాన్ టీఎస్జీవోస్ కాలనీ లో నివాసం ఉంటు కాటేదాన్ లోని ఆ కంపెనీ లో వాచ్మెన్ గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య వినతి, ఇద్దరు సంతానం ఉంది. గత కొంతకాలంగా నాబా కుమార్ మహపాత్ర ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి వాచ్మెన్ పని చేయడానికి కాటేదాన్ లోని కంపెనీ వద్ద కు వచ్చిన నాబా కుమార్ మహపాత్ర కంపెనీ ముందు ఉన్న చెట్టుకు సోమవారం తెల్లవారు జామున లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం పనికి వచ్చిన వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. మైలార్దేవుపల్లి ఎస్ఐ జయలక్ష్మి సం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. భార్య వినతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.




## పుట్‌పాత్ అక్రమణలకు మంగళం పడేనా??

**మంగళవారం పుట్ పాత్ అక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం**

**ఇప్పటికే మున్సిపల్, ట్రాఫిక్ పోలీసులు షాపు యజమానులకు మౌఖిక ఆదేశాలు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 11 (నమస్తే ఉదయం)**

గద్వాల మున్సిపాలిటి పరిధిలోని రోడ్డుకు ఇరువైపులా పుట్ పాత్ అక్రమించి, డబ్బాలు వేసి వ్యాపారాలు కొనసాగించడంతో పాదచారులకు నరకంగా మారిన పుట్‌పాత్ అక్రమణలపై అధికారులు ఉక్కుపాదం మోపనున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు పరిష్కారం చూపే దిశగా, మంగళవారం భారీ స్థాయిలో అక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టేందుకు గద్వాల మున్సిపల్ మరియు ట్రాఫిక్ పోలీస్ యంత్రాంగం సర్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే మున్సిపల్ అధికారులు అక్రమణకు గురైన పుట్ పాత్ లను , రోడ్లను గుర్తించి మార్కింగ్ వేయడం జరిగింది. ఈ మేరకు ప్రధాన రహదారుల వెంట ఉన్న దుకాణదారులకు, తోపుడు బండ్ల వ్యాపారులకు మున్సిపల్ అధికారులు మరియు ట్రాఫిక్ పోలీసులు మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ట్రాఫిక్ ఎస్ఐ బాల చంద్రుడు కృష్ణవేణి చౌరస్తా నుంచి భీంనగర్ లో గల షాపుల యజమానులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. పుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన షెడ్లు, సామాగ్రిని స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. గద్వాల పట్టణంలో కృష్ణవేణి చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా, కృష్ణవేణి చౌరస్తా నుంచి భీంనగర్ వరకు అధికారులు ఎక్కడి వరకు మార్కింగ్ చేశారో అక్కడి వరకు అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటిని తొలగిం చేందుకు సిద్ధమయ్యారని తెలుస్తోంది.




సమావేశంలో పాల్గొన్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

## వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండ జాగ్రత్తలు తీసుకోవాలి

**రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్, మే 11 (నమస్తే ఉదయం) :**

రాబోయే వర్షాకాలంలో రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని రాజేంద్రనగర్, అత్తాపూర్, చాంద్రాయణగుట్ట , జంగం మెట్, పలుకునుమ, బహుదూర్ పుర సర్కిళ్ల లో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అదికారులకు సూచించారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ , హైడ్రా, ఇంజనీరింగ్ విభా గాల అధికారులతో ఆయన వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు ...తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైడ్రా గుర్తించిన వర్షాకాలంలో నీరు నిలచి ఉండే 30 పాయింట్ల ను ప్రస్తావిస్తూ , వర్షాకాలంలో నీరు నిలువ ఉండే ప్రాంతాలలో ఇప్పటినుంచే జాగ్రత్తలు తీసుకొని నీరు నిలవకుండా ఉ ండడానికి కావలసిన పనులు చేయాలన్నారు . అందుకోసం హైడ్రా, జీహెచ్ఎంసీ, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్ లలో నీరు నిలిచే ప్రాంతాలు 15 ఉన్నాయని, మిగతా సర్కిళ్లలో 15 పాయింట్లు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో హైడ్రా రాజేంద్రనగర్ జోనల్ ఇంచార్జీ మహేష్, జీహెచ్ ఎంసీ రాజేంద్రనగర్ జోన్ ఇంచార్జీ ఎస్ ఈ నరేందర్ గౌడ్, ఈ ఈ లు వెంకట శేషయ్య లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు

## తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలుగా రాజేంద్రనగర్ నియోజకవర్గంకు చెందిన కుమారి అబ్దేశి సదాలక్ష్మీ

**బుద్వేల్, మే 11 (నమస్తే ఉదయం)**




కుమారి అబ్దేశి సదాలక్ష్మి

తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలుగా అత్తాపూర్ సర్కిల్ మైలార్దేవుపల్లి ఉడంగడ్డ దళిత బస్తీకి చెందిన అబ్దేశి సదాలక్ష్మీ నియమితులైనారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామక్రిష్ణరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సదాలక్ష్మి ఎంఎ లైబ్రెరీ సైన్స్, జర్నలిజంలో పీజీ పూర్తి చేశారు. 1974 ఫిబ్రవరి 10వ తేదీన జన్మనించిన ఆమె విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత సామాజిక సేవ, మహిళా సాధికారత కోసం పనిచేస్తు వచ్చారు. రాజేంద్రనగర్ మున్సిపాలిటీ కమ్యూనిటీ డెవలప్ మెంట్ సొసైటీ చైర్మన్ గా పనిచేశారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో టెలిఫోన్ అడ్వయిజరీ బోర్డు సభ్యురాలుగా, పోడు భూములపై అటవీశాఖ సలహామం డలి సభ్యురాలుగా పనిచేశారు. నిరంతరం మహిళలు, వృద్ధుల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టే ఎ సదాలక్ష్మి కి మహిళా కమిషన్ సభ్యురాలుగా బాధ్యతలు అప్పచెప్పడంతో రాజేంద్రనగర్ నియోజకవర్గం కు చెందిన మహిళా సంఘాల సభ్యులు, వివిధ కుల సంఘాలు, రాజకీయపార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## గంజాయి ఇప్పిస్తానని చెప్పి రూ.700లు తీసుకున్న వ్యక్తి గంజాయి ఇప్పించకపోవడంతో కొట్టి చంపిన యువకులు

**బుద్వేల్, మే 11 (నమస్తే ఉదయం)**



మహ్మద్ హుస్సేన్ అలియాస్ వసీమ్

గంజాయి ఇప్పిస్తానని చెప్పి రూ. 700లు తీసుకుని గంజాయి ఇప్పించకపోవడం, తిరిగి తీసుకున్న డబ్బులు ఇవ్వకపోవడంతో ఓ యువకునిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి అతను మృతి చెందడానికి కారణమైన 10 మంది యువకులలో ఎనిమిది మంది య వకులను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్ కు తరలించారు. వివరాలను రాజేం ద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ ఓ ప్రకటన లో తెలియజేశారు. లంగర్ హౌజ్ కు చెందిన మహ్మద్ హుస్సేన్ అలియాస్ వసీం (24) ఏసీ టెక్నిషియన్గా పనిచేస్తాడు. గంజాయి ఇప్పిస్తానని చెప్పి కొందరు యువకుల నుంచి ఆయన ఇటీవల రూ.700 లు తీసుకున్నాడు. ఎంతకు గంజాయి ఇవ్వలేదు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వలేదు. దీంతో హుస్సేన్ కు డబ్బులు ఇచ్చిన యువకులకు మధ్య గొడవ మొదలైంది. ఈ నెల 9వ తేదీన శివరాంపల్లి సమీపంలోని ఖుషీ ఫంక్షన్ హాల్ వద్ద కనిపించిన హుస్సేన్ ను అడ్డగిం చిన యువకులు అతనిపై దాడి చేశారు. అనంతరం అతన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయం సమీపంకు తీసుకువెళ్లి అక్కడ దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన హుస్సేన్ ను వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారానికి కొద్ది దూరంలో వదిలి పారిపోయారు. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు గాయపడ్డ హుస్సేన్ ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతు మృతి చెందాడు. సీసీ టీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల ద్వారా ప్రత్యక్ష సాక్షుల సహాయంతో మొత్తం 10 మంది నిందితులను పోలీసులు గుర్తించారు. వారిలో ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. ఘటన సమయంలో ఉపయోగించిన ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో శివరాంపల్లి పరిసర బస్తీలకు చెందిన కొంగళ్ల ప్రశాంత్, మిట్ట జగదీశ్, రామ్ రోషన్ యాదవ్, గరుడ తరుణ్ కుమార్, అరుకల నిఖిల్, గుగులోత్ రాజ్ కుమార్, కాపులూరి వెంగల్ రావు అలియాస్ వెంగ, మంకాల ప్రశాంత్ అలియాస్ సోను లు ఉన్నారు. మిగతా ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఘనంగా బీఈఎస్.టిఐయూ అంతర్జాతీయ సదస్సు

**పరిశోధనలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలి... ఛాన్సలర్ డా. రూపా వాసుదేవన్**

**కూకట్ పల్లి, మే 11 (నమస్తే ఉదయం)**

పరిశోధనలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా సమాజ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు అందించేలా ఉండాలని భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ (బీఈఎస్.టిఐయూ) ఛాన్సలర్ డా. రూపా వాసుదేవన్ పేర్కొన్నారు. హైదరాబాద్ ఉప్పల్ లోని బీఈఎస్.టిఐయూ పరిశోధన, ఆవిష్కరణ కేంద్రం ఆధ్వర్యంలో పరిశోధనలో సృజనాత్మకత ఆవిష్కరణ అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ఘనంగా జరిగింది. సదస్సును ఛాన్సలర్ డా. రూపా వాసుదేవన్, వైస్ చాన్సలర్ డా. కె. నాగజ్యోతి, సైంటిఫిక్ చైర్ డా. ఆశుతోష్ శర్మ, ముఖ్య అతిథి డా. గోపాల్ లాల్, గౌరవ అతిథి డా. వల్లీ మణికం ప్రారంభించారు. దేశ విదేశాల నుంచి శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద



సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. రూపా వాసుదేవన్ మాట్లాడుతూ, సమాజానికి ఉపయోగపడే పరిశోధనల ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అంతర్జాతీయ సదస్సులు శాస్త్రీయ పరస్పర వినిమయానికి వేదికలని, విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన, స్వతంత్ర పరిశోధన దృక్పథం పెంపొందించేందుకు విశ్వవిద్యాలయం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వైస్ చాన్సలర్ డా. కె. నాగజ్యోతి పేర్కొన్నారు. ఆధునిక పరిశోధన విధానాలు, సాంకేతిక పురోగతి, సృజనాత్మక సమస్య పరిష్కారాలపై చర్చించేందుకు ఈ సదస్సు ఉత్తమ వేదికగా నిలిచిందని డా. ఆశుతోష్ శర్మ తెలిపారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో పరిశోధనలో సృజనాత్మకత ఆవిష్కరణ అంశంపై సదస్సు నిర్వహించడం సమయోచితమని డా. గోపాల్ లాల్ అభిప్రాయపడ్డారు. సదస్సులో ప్రధాన ప్రసంగాలు, సాంకేతిక సెషన్లు, పేపర్ ప్రెజెంటేషన్లు, ప్యానెల్ చర్చలు నిర్వహించగా, పరిశోధకులు తమ వినూత్న పరిశోధన పత్రాలను సమర్పించారు. అనంతరం పేపర్ ప్రెజెంటర్లకు, పరిశోధకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సదస్సు ద్వారా పరిశోధన, ఉన్నత విద్య రంగాల్లో సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో బీఈఎస్.టిఐయూ తన నిబద్ధతను చాటిచెప్పింది.

# బొల్లారం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వేసవి శిబిరం ప్రారంభించిన చంద్రారెడ్డి

**పటాన్ చెరు,మే 11 (నమస్తే**

సమ్మర్ క్యాంప్ ద్వారా విద్యార్థులు తమలోని వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం కలుగుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి చంద్రారెడ్డి అన్నారు. సోమవారం పాఠశాలలో పిఎం ఎస్ హెచ్ ఆర్ ఐ పథకం క్రింద ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాన్స్, మ్యూజిక్, గేమ్స్, ఆర్ట్, హ్యాండ్‌రైటింగ్, స్టోరీ టెల్లింగ్, క్రియేటివిటీ వంటి అంశాలను నేర్చుకోవడం ద్వారా విద్యార్థులు నిజ జీవితంలో స్థిరపడేందుకు బలమైన పునాదులు ఏర్పడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిన్నారం ఎంఇఓ కె. విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ పథకం క్రింద బొల్లారం పాఠశాల విద్యార్థులు జిన్నారం మండలానికి రోల్ మోడల్‌లుగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఈ విద్యార్థుల నైపుణ్యం చూసి ఇతర విద్యార్థులు కూడా వివిధ నైపుణ్యాలను నేర్చుకునేలా




ఆదర్శంగా ఉండాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని విద్యార్థులు తమ అభివృద్ధి మరియు మంచి భవిష్యత్తు కోసం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అనంతరం ప్రధానోపాధ్యాయులు జి. మంగీలాల్ మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్ యొక్క ఉద్దేశ్యాన్ని వివరించారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను



వెలికితీయడం, వారి ఆసక్తులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్టీయు అధ్యక్షుడు అనీల్ కుమార్, టిపిటిఎఫ్ అధ్యక్షుడు కె రామచందర్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇండ్ల గణన ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 11(నమస్తే ఉదయం)**



జనగణన 2027లో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాలో కొనసాగుతున్న ఇండ్ల గణన ప్రక్రియ పై జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఇండ్ల గణన ప్రక్రియను అధికారులు నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. తమకు కేటాయించిన గృహ జాబితా బ్లాక్ పైన పూర్తి అవగాహన తెచ్చుకోవాలని తెలిపారు. జనగణన గృహ జాబితా ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, గృహ జాబితా కార్యక్రమం భవిష్యత్తు ప్రణాళికలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఈ టెలి కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, కిరణ్మయి, సి పి ఓ సౌమ్య, జిల్లా సెన్సస్ ఇన్చార్జి శిరీష ,ఆర్డీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు,ఎన్యుమరేటర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణికి 85 ఫిర్యాదులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి,మే11(నమస్తే ఉదయం)**

ప్రజావాణికి(85)ఫిర్యాదులుసోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (85) ఫిర్యాదులు అందాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ-- 42, ఇతర శాఖలు -- 43, మొత్తం 85 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరు స్వీయ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి: సినీ నటుడు సుమన్

### క్రీడల పట్ల ఆసక్తి కలిగిన ఎమ్మెల్యే దొరకడం అదృష్టం

**పటాన్ చెరు,మే 11 (నమస్తే ఉదయం):**

పటాన్ చెరులో అట్టహాసంగా ముగిసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక 10వ జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో విజేతలకు సినీ నటుడు సుమన్ తో కలిసి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి బహుమతులు అందజేసారు ప్రస్తుత సమాజంలో స్వీయ రక్షణ కోసం విద్యార్థినిలు, మహిళలు తప్పకుండా కరాటే నేర్చుకోవాలని.. దీని ద్వారా మానసిక ప్రశాంతత.. శారీరక ధారుడ్యత లభిస్తుందని సినీ నటుడు సుమన్ అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని భారతరత్న పీవీ నరసింహారావు ఆడిటోరియంలో ఎమ్మెల్యే జిఎంఆర్ సౌజన్యంతో లక్కీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక పదవ జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హీరో సుమన్ మాట్లాడుతూ క్రీడల పట్ల ఆసక్తి కలిగి.. నిరంతరం క్రీడల అభివృద్ధికి నిబద్ధతతో కృషి చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి దొరకడం పటాన్చెరు నియోజకవర్గం ప్రజల అదృష్టమని అన్నారు. గత పది సంవత్సరాలుగా జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీలకు సహకారం అందించడం పట్ల అభినందనలు తెలిపారు. తాను విద్యార్థి దశ నుండి మార్షల్ ఆర్ట్స్ ని నేర్చుకోవడం ప్రారంభించామని 50 సంవత్సరాలు గడిచిన ఇంకా ఆసక్తి తగ్గలేదని తెలిపారు. చదువుతోపాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా ఏడాది పొడవునా వివిధ అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర జాతీయ స్థాయి క్రీడలకు పటాన్చెరు కేంద్రంగా నిలవడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకట్ రెడ్డి, వెంకటేష్, షకీల్, రామ్మోహన్, వినోద్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.



# రాజకీయాలకు అతీతంగా బొల్లారం డివిజన్ అభివృద్ధి: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

### ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం


### 19 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

### ప్రజాఅవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన

**పటాన్ చెరు,మే 11 (నమస్తే ఉదయం)**

రాజకీయాలకు అతీతంగా బొల్లారం డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.సోమవారం బొల్లారం డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్, బీసీ కాలనీ, బీరప్ప బస్తి, గాంధీ నగర్, ఐడిఎ కాలనీ, కె.బి.ఆర్ కాలనీ, లక్ష్మీ నగర్, శ్రీ రామ్ నగర్, వైఎస్ఆర్ కాలనీలలో 19 కోట్ల రూపాయలు అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, యూజీడి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బొల్లారం డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నామని తెలిపారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న తాగునీటి సమస్యను సైతం పరిష్కరించడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు రూపకల్పన చేయబోతున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, జిన్నారం మాజీ జడ్పిటిసి బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, చంద్రారెడ్డి, వరప్రసాద్ రెడ్డి,సిఐ రవీందర్ రెడ్డి, ఈఈ సురేష్, డిఈ వెంకటరమణ, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు: మంత్రి శ్రీధర్ బాబు





**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 11(నమస్తే ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం రంగారెడ్డి జిల్లాలోని సరూర్ నగర్ ఇన్డోర్ స్టేడియం, ఎల్. బి. నగర్ లో మెగా జాబ్ మేళాను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , ఐ. టి. ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్యం శాసనసభ వ్యవహారాల మంత్రిత్వ శాఖా వారు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి , అడిషనల్ కలెక్టర్ కె. కిరణ్మయి , రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి , టి యు ఎఫ్ ఐ డి సి చైర్మన్ చల్ల నరసింహారెడ్డి , మాజీ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి , ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్లు లక్ష్మి , డి. వినయ్ కుమార్ , మహేష్ , డి ఈ ఈ టి డైరెక్టర్ జె. రాజేశ్వర్ రెడ్డి , టి ఏ ఎస్ కె సీఈవోనితిన్ కుమార్ రెడ్డి జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఇందులో ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ పరిశ్రమలు, ఐ. టి. కంపెనీలు , ఇతర సేవా రంగ సంస్థలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుండి దాదాపు 4318 మంది ఉద్యోగార్థులు జాబ్ మేళాలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగింది.. ఈ సందర్భంగా మంత్రి తమ ప్రసంగంలో ఈనాటి జాబ్ మేళా కార్యక్రమం గురించి మాట్లాడుతూ... ఈ కార్యక్రమానికి 123 కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. జాబ్ మేళా నిర్వహిస్తున్న కంపెనీల విధానాల గురించి యువతకు తెలియజేశారు. ఉదాహరణకు ఏఐ, ఐటీ రంగాల, గురించి తెలియజేశారు. ఈ ప్రభుత్వం యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం యువత అపార అవకాశాలు కల ఉత్పత్తి, సేవా , రవాణా రంగాల్లో యువత నైపుణ్యత పెంచుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన డి ఈఈ టి నిరుద్యోగులకు, పరిశ్రమలకు మధ్య వారధిగా ఎన్నో అవకాశాలను కల్పిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ప్రసంగిస్తూ నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశమే ప్రభుత్వ సంకల్పమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 3716 ఉద్యోగార్థులు పాల్గొనగా 1645 మంది షార్ట్ లిస్ట్ కాగా 779 ఉద్యోగార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన కొందరి అభ్యర్థులకు మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు.

# షూటింగ్ బాల్ నేషనల్ ఛాంపియన్ షిప్‌కు విద్యార్థిని ఎంపిక

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 11 (నమస్తే ఉదయం)**



ఈ నెల 12 నుండి 14 వ తేది వరకు మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో జరగబోయే 45 వ షూటింగ్ బాల్ నేషనల్ ఛాంపియన్ షిప్ కు గద్వాల్ మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థిని సమ్రీన్ ఎంపికైనట్లు గద్వాల్ షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కృష్ణయ్య,సెక్రటరీ మంజునాథ్, తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపల్ భవాని, మరియు ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ రాధ అభినదించారు. అలాగే మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి పోటీలో కూడా రాణించి పాఠశాలకు మరియు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతి తీసుకరావాలని సూచించారు.

# పూజారి తాండ గ్రామ పంచాయతీ పాఠశాలలో టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన



**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 11 (నమస్తే ఉదయం)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా సోమవారం నుంచి విద్యా వారోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కేటిదొడ్డి మండలం పూజారి తాండ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించనున్న టాయిలెట్ బ్లాక్ (బాత్రూమ్స్) నిర్మాణ పనులకు సోమవారం గ్రామ సర్పంచ్ రాజు నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు, ముఖ్యంగా బాలికలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయమని, టాయిలెట్ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ వెంకటేష్ గౌడ్, పాఠశాల హెడ్ మాస్టర్, గ్రామ పెద్దలు, గ్రామ యూత్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.